E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
హైదరాబాద్ (తేదీ) 17-03-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:74 || పేజీలు–6
www.ekaburu.com

## భారత్‌కు చేరుకున్న 'శివాలిక్'

..నేడు 'జగ్ లడ్కీ' రాక

**ఈ-కబురు , ఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎల్పీజీని మోసుకొచ్చిన శివాలిక్ ట్యాంకర్ సోమవారం భారత్‌లోని గుజరాత్ ముంద్రా పోర్ట్‌కు వచ్చింది



03

# మీతో కలిసి రాలేం

దుబాయ్ విమానాశ్రయంపై దాడి ● తెరిచిన వెంటనే మూసివేత

- హర్మూజ్ ప్రాంతానికి యుద్ధ నౌకలను పంపలేం
- ట్రంప్‌నకు షాకిచ్చిన మిత్ర దేశాలు
- ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదన్న జర్మనీ
- బ్రిటన్, జపాన్‌దీ అదే వైఖరి
- పర్షియన్ గల్ఫ్‌లో రవాణాపై ఇరాన్ పట్టుతో ఆందోళన తీవ్రం
- టెహ్రాన్, బీరుట్‌లపై బాంబుల వర్షం



**ఈ-కబురు, దుబాయ్, బీరుట్**: అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన సంక్షోభం, తద్వారా ఆర్థిక సంక్షోభం భయాలు చుట్టుముడుతున్నాయి. ఈ నేపథ్యంలో బలప్రయోగం ద్వారా హర్మూజ్ జల సంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడికి యుద్ధ నౌకలను పంపేందుకు మిత్ర దేశాలతోపాటు చైనా ససేమిరా అన్నాయి. ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదని ఐరోపా దేశాలు తెగేసిచెప్పాయి. మరోవైపు ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను కొనసాగించాయి. ఇరాన్ డ్రోన్ దాడితో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెరిచిన కొద్ది గంటల్లోనే మూసివేయాల్సి వచ్చింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ దాడులను కొనసాగించింది. పశ్చిమాసియాలో సైనిక చర్యను వెంటనే నిలిపేయాలని అమెరికా, ఇజ్రాయెల్‌ను చైనా కోరింది. హర్మూజ్‌ను తెరిపించడానికి చైనా సహా పలు దేశాలు యుద్ధ నౌకలను పంపాలని ట్రంప్ కోరిన నేపథ్యంలో ఆ దేశం స్పందించింది. అన్నివైపుల నుంచీ దాడులను వెంటనే ఆపాలని చైనా సూచించింది.

హర్మూజ్‌ను తెరిపించడానికి ఆచరణీయ ప్రణాళికను తాము కోరుకుంటున్నామని బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ తెలిపారు. యుద్ధాన్ని మరింత విస్తరించబోమని స్పష్టంచేశారు. దీనిపై అమెరికా, గల్ఫ్, ఐరోపా దేశాలతో చర్చిస్తున్నామన్నారు. దీనిని బట్టి హర్మూజ్‌కు యుద్ధ నౌకలను పంపే ఉద్దేశం ఆయనకు లేనట్లు కనిపిస్తోంది. జపాన్ ప్రధాని సనాయీ తకాయిచి పార్లమెంటు వేదికగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సముద్ర జలాల మీదుగా రాకపోకలు సాగించే ఆయిల్ ట్యాంకర్లు, నౌకలకు భద్రత కల్పించేందుకు నౌకాదళాన్ని పంపే ఆలోచనేదీ లేదని ఆమె వెల్లడించారు. తమ నౌకాదళాన్ని హర్మూజ్ వద్దకు పంపే అంశంపై ప్రస్తుతం అమెరికాతో చర్చలు జరుపుతున్నట్లు దక్షిణ కొరియా తెలిపింది. హర్మూజ్ జల సంధిపై తాము అమెరికాతో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు జరపలేదని భారత్ స్పష్టం చేసింది. ఇది నాటో యుద్ధం కాదని జర్మనీ ఛాన్సలర్ అధికార ప్రతినిధి స్టెఫాన్ కొర్నెలియస్ తెలిపారు. యుద్ధం ప్రారంభానికి ముందు అమెరికా తమను సంప్రదించలేదని స్పష్టం చేశారు. చర్చల ద్వారా యుద్ధానికి ముగింపు పలికే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టంచేశారు.

మిగతా 2లో

## సభకు విధిగా రావాల్సిందే

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ





- అధికారం పోతే ఒక్కరిదే కాదు... అందరిదీ పోతుంది
- ప్రతిపక్షాల విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలి
- బయట వ్యక్తిగతంగా చిట్‌చాట్‌లు వద్దు
- సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలను హెచ్చరించిన సీఎం

ఈకబురు , హైదరాబాద్ : శాసనసభ ప్రాంగణంలో.. తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి నిలువెత్తు ప్రతిబింబంగా, అస్తిత్వం, సంస్కృతికి ప్రతిరూపమైన శక్తి స్వరూపిణి "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి గవర్నర్ గారు విగ్రహాన్ని ఆవిష్కరించారు.శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.ముందుగా ముఖ్యమంత్రి తో కలిసి గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ గారి విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.

మిగతా 2లో

ప్రగతి ఫలాలు
### ప్రతి ఇంటికీ..

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం

- ఆదర్శ తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తాం
- ప్రజాసాధికారత, సమ్మిళిత అభివృద్ధి, అవకాశాల సృష్టిపై దృష్టి



02



### ఈ నెల 30 వరకు అసెంబ్లీ

20న రాష్ట్ర బడ్జెట్.. బీఏసీ సమావేశంలో నిర్ణయం

ఈకబురు, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ , శాసన మండలి బడ్జెట్ సమావేశాలు ఈనెల 30వ తేదీ వరకు జరుగనున్నాయి.



5

ఓ తండ్రి పోరాటానికి
### 'ఆరు ఆస్కార్లు'

అవార్డుల్లో 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' జోరు

ఈ-కబురు : కథలో సత్తా ఉండి.. ప్రతి పాత్రలోనూ మనసును తాకే భావోద్వేగాలు పలికితే ప్రేక్షకుడు ఇట్టే లీనమైపోతాడు. అలాంటి ఓ హృదయాన్ని మెలిపెట్టే కథతో తెరకెక్కిన చిత్రానికే ఈసారి ఆస్కార్ పంట పండింది. బిడ్డ నమ్మకాన్ని గెలిపించడం కోసం ఓ తండ్రి చేసిన పోరాట కథతో తెరకెక్కిన 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'.. ఉత్తమ చిత్రం సహా ఆరు పురస్కారాలు గెలుచుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



3

నేడు, రేపూ తెలంగాణలో
### తేలికపాటి వర్షాలు

ఈ-కబురు హైదరాబాద్: కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాంరాం?



ఈ నెల 25, 26 తేదీల్లో నిర్ణయం ప్రకటిస్తారని ప్రచారం
బీఆర్ఎస్‌లో చేరతారని అంటున్న అనుచరులు
కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు: జీవన్‌రెడ్డి

02



నార్సింగిలో దారుణం..
### ఆరేళ్ల బాలికపై హత్యాచారం

ఈ-కబురు , హైదరాబాద్: నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు.

02

## అన్నలకు 'ఆధార'మేదీ..?

- లొంగిపోయిన మావోలకు కొత్త చిక్కులు
- రివార్డుల అందజేతకు ఆధార్ తప్పనిసరి



**ఈ-కబురు:**
025 జనవరిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పరిసరాల్లో సుమారు 25 ఏళ్లపాటు అజ్ఞాతంలో ఉండి లొంగిపోయిన కోరుట్లకు చెందిన పసుల వసంతకు ఇప్పటికీ పునరావాస సాయం అందలేదు. కారణం.. ఆమెకు ఆధార్ కార్డు లేకపోవడమే! 2025 అక్టోబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 197మంది, మహారాష్ట్రలో 61 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో కొత్తగా రిక్రూట్ అయిన 140 మంది మినహా మిగతావారికి ఆధార్‌కార్డులు లేవు. 2026 ఫిబ్రవరిలో మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావుతోపాటు సుమారు 180మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో సగానికిపైగా మావోయిస్టులకు ఎలాంటి ఆధారాలూ లేవు.

మిగతా 2లో

నందిని సిధారెడ్డికి
## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

- కవి నందిని సిధారెడ్డికి అభినందనలు తెలిపిన సీఎం రేవంత్



**ఈ-కబురు , హైదరాబాద్ :**
తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన "అనిమేష" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాది అన్నారు.

మిగతా 2లో

రాజ్యసభకు
## నితిన్, నితీశ్ ఎన్నిక



బిహార్‌లో 5 సీట్లూ గెలుచుకున్న ఎన్డీయే
ఒడిశాలో క్రాస్ ఓటింగ్‌తో మూడోదీ కైవసం

ఈకబురు పట్నా: భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్, బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. వారితోపాటు మరో ముగ్గురు బిహార్ నుంచి రాజ్యసభకు వెళ్తున్నారు. ఒడిశాలో క్రాస్ ఓటింగ్ ద్వారా మూడో స్థానాన్నీ ఎన్డీయే గెలుచుకుంది. హరియాణాలో కౌంటింగ్ నిలిచిపోయింది. దీంతో అక్కడి 2 స్థానాలకు జరిగిన ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. బిహార్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన వారిలో నితిన్, నీతీశ్‌తోపాటు కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ (జేడీయూ), శివేశ్ కుమార్ (భాజపా), ఉపేంద్ర కుశ్వాహా (రాష్ట్రీయ లోక్ మోర్చా) ఉన్నారు. సోమవారం ఈ ఐదుగురి ఎన్నికను విధానసభ కార్యదర్శి, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖ్యాతి సింగ్ ప్రకటించారు

మిగతా 3లో



### రైతన్నలకు వెన్నుపోట్లు.. రాహుల్‌కి వెయ్యికోట్లు!

ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ: కేటీఆర్

03

కాల్పులు జరిపి
## తప్పించుకోవాలని..



ఫాంహౌస్‌ను 'ఈగల్' పోలీసులు చుట్టుముట్టడంతో టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్, రోహిత్‌రెడ్డి బృందం ప్లాన్
ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

03

**ఈ-కబురు హైదరాబాద్**: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ కేసుకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనిప్రకారం ఫాంహౌస్‌ను 'ఈగల్' బృందం, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో అవాక్కైన టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ , పైలట్ రోహిత్‌ల బృందం వారిపై కాల్పులు జరిపి తప్పించుకోవాలని ప్లాన్ చేసింది.

### సినీనటి ప్రత్యూష మృతి కేసు.. కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి



02

# అన్నలకు 'ఆధార'మేదీ..?



కొత్త ఆధార్ కోసం తిప్పలు

ఈ లెక్కన లొంగిపోయిన మావోయిస్టుల్లో చాలామందికి ఆధార్‌కార్డులు లేవు. కొత్తగా ఆధార్ కార్డు సృష్టించుకోవడం సమస్యగా మారింది. ఆధార్ కార్డులు లేని మావోయిస్టులు తమ సొంత గ్రామాల్లో ఉన్న ఇళ్లల్లో.. లేకుంటే కొత్తగా అద్దె ఇంట్లో ఉన్నట్లు చిరునామాపై రెవెన్యూ అధికారుల నుంచి రెసిడెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. రెసిడెన్స్‌తోపాటు తాము మావోయిస్టు పాలో అజ్ఞాతంలో ఉండి లొంగిపోయిన సందర్భంలో పోలీసు ఉన్నతాధికారుల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రం జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా దరఖాస్తు చేసుకున్న తరువాత కొన్ని సాంకేతిక సమస్యలతో ఆధార్‌కార్డులు వెంటనే రావడం లేదు. ఒకటికి రెండు సార్లు అన్ని డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంటే కేంద్ర ఆధార్ జారీ సంస్థ నుంచి కొత్త ఆధార్ కార్డు వస్తుంది. అనంతరం పాన్‌కార్డు తీసుకోవడానికి వెసులుబాటు ఉంటుంది.

**పునరావాసంలో జాప్యం తప్పదా..!?**

కొత్త ఆధార్ కార్డులు తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యం ఫలితంగా పునరావాస కల్పనలో జాప్యం జరుగుతోంది. ఏళ్ల తరబడి అజ్ఞాతంలో ఉన్నవాళ్లు కావడంతో వారికి ఎలాంటి గుర్తింపు కార్డులూ లేవు. వీరిలో చాలామంది పెద్దగా చదువుకున్న వారు కాకపోవడంతో పాఠశాలల్లో పుట్టిన తేదీలు లేక ఆధార్ నమోదు చేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులు రెసిడెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నా.. పంచనామాలో సాక్షులు సరిగా దొరకక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలా ఆధార్ కార్డు నమోదు కావడానికి నెల నుంచి రెండు నెలల కాలం పడుతోంది. పేరున్న మావోలకు ఉన్నతాధికారుల నుంచి ఉన్న సహకారంతో త్వరగానే ఆధార్‌కార్డులు వస్తున్నప్పటికీ సాధారణ మావోయిస్టులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ఈ క్రమంలో లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డుల అందజేత, పునరావాస కల్పనలో తీవ్ర జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మీతో కలిసి రాలేం..

రవాణాపై దెబ్బ

హర్మూజ్ ప్రాంతంలో నౌకలపై ఇరాన్ దాడులు, హెచ్చరికలతో నౌకల రవాణా దాదాపుగా నిలిచిపోయింది. దీంతో ఏదో ఒకటి చేయాలనే ఒత్తిడి అమెరికా నాయకత్వంపై పెరుగుతోంది. అదే సమయంలో వినియోగదారులపై ధరల భారం పడుతోంది. హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు ఆ ప్రాంతంలో ఉమ్మడిగా పోలీసింగ్ చేయాలని ట్రంప్ పిలుపునివ్వగా ఎవరూ స్పందించలేదు. యుద్ధ నౌకలను పంపాలని చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్‌లను కోరారు. దీంతో.. వారు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు

పరిమిత ఆపరేషన్ల కోసం లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు ప్రవేశించాయి. హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపు దాడుల నుంచి సరిహద్దు ప్రజలను రక్షించడానికి ఈ ఆపరేషన్ చేపట్టామని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కర్నల్ నదవ్ షోషానీ తెలిపారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ముగ్గురు మరణించారు. ఇందులో ఇద్దరు వైద్య సిబ్బంది ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున లెబనాన్ రాజధాని బీరుట్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. యుద్ధం తొలి రెండు వారాల్లో 70శాతం ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. మొత్తం 7,600 దాడులు చేశామని, 85శాతం గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని, అణు కేంద్రాలనూ ధ్వంసం చేశామని వివరించింది.

ఇరాక్‌లోని జుర్ఫ్ అల్‌శఖర్ ప్రాంతంలో ఉన్న ఇరాన్ అనుకూల పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్‌పై (పీఎంఎఫ్) దాడులు జరిగాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఇంధన ట్యాంకుపై డ్రోన్‌తో ఇరాన్ దాడి చేసింది. అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పేశాయి. యూఏఈ రాజధాని అబుధాబీలో ఓ వాహనంపై ఇరాన్ క్షిపణి పడింది. ఈ ఘటనలో పాలస్తీనావాసి మరణించారు. చమురు క్షేత్రాలున్న తూర్పు ప్రాంతంపై ఇరాన్ ప్రయోగించిన 37 ఇరాన్ డ్రోన్లను సౌదీ అరేబియా అడ్డుకుంది. బహ్రెయిన్ దేశంపైకి దూసుకొచ్చిన 4 క్షిపణులు, 3 డ్రోన్లను రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంలో సైరన్ల మోత మోగింది. ఇరాన్ నుంచి క్షిపణులు దూసుకొచ్చాయి. వాటిని గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. జెరూసలెంలో చర్చికి సమీపంలోని గ్రీక్ ఆర్థోడాక్స్ పేట్రియార్క్ పైకప్పుపై యుద్ధ శకలం పడింది. అది ఏసుక్రీస్తుకు సిలువ వేసిన, ఆయనను సమాధి చేసిన ప్రాంతంలో నిర్మించిన చర్చికి సమీపంలోనే ఉంది. కువైట్, ఖతార్‌లపైనా దాడులు జరిగాయి.

ఇరాన్ పునర్నిర్మాణానికి పదేళ్లు: ట్రంప్ అమెరికా దాడులవల్ల ఇరాన్ సైన్యం తీవ్రంగా దెబ్బతిందని, ఆ దేశాన్ని పునర్నిర్మించడానికి కనీసం 10 సంవత్సరాలు పడుతుందని ట్రంప్ తెలిపారు. 'ఇరాన్ తీవ్రంగా



దెబ్బతింది. ఇప్పుడు మేం వెనక్కి వెళ్లినా మళ్లీ వాటిని పునర్నిర్మించడానికి 10 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. కానీ ఇప్పుడే యుద్ధం ముగిసిందని ప్రకటించడం లేదు. అమెరికా సైనిక చర్యలు ఇరాన్‌ను ఓడించాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# సభకు విధిగా రావాల్సిందే

ఈకబురు : హైదరాబాద్: ''శాసనసభకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలి. కొందరు అసెంబ్లీకి వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. ఇలా ఎమ్మెల్యే పదవికి అన్యాయం చేయొద్దు. ఇకపై ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సభ్యుల హాజరును నమోదు చేస్తాం'' అని తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించినట్లు సమాచారం. సోమవారం శాసనమండలి కమిటీ హాలులో జరిగిన కాంగ్రెస్ శాసన సభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఆయన వివిధ అంశాలను ఎమ్మెల్యేలకు వివరించారు. పార్టీవర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు సీఎం మాట్లాడుతూ... ''మీరు శాసనసభ్యులుగా ఎన్నికవడానికి ఎంతోమంది అనేక విధాలుగా కష్టపడారు. ఇప్పుడు మీరు సభలో కూర్చోకుంటే అసలు ఎమ్మెల్యేగా ఎన్నికవడమెందుకు? సభకు రాకుండా ఆ పదవికి అన్యాయం చేయొద్దు. అద్లూరి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే కావడానికి 30 ఏళ్లు పట్టింది. ఈ సమావేశానికి కూడా కొందరు రాలేదు. వారు సీఎల్పీకి రానంత బిజీగా ఉన్నారా? పార్లమెంట్‌లో ఎంపీలను కలిసేందుకు మంత్రులు విడిగా సమయమిస్తారు. మన మంత్రులూ ఎమ్మెల్యేలకు తగిన సమయమివ్వాలి. నేను కూడా ఎమ్మెల్యేలను కలిసేందుకు సమయమిస్తా. అయితే, నా దగ్గరికి వచ్చినవారే పదేపదే వస్తున్నారు. సభలో ప్రతిపక్షాల విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలి.

ప్రతిపక్షాలు 'నన్నేం అన్లేదు' కదా అని ఎవరికివారు వ్యక్తిగతంగా అనుకుని... ఏం మాట్లాడకుంటే అందరం నష్టపోతాం. రాష్ట్రంలో అధికారం పోతే అందరిదీ పోతుంది. ఒక్కరిదే పోదు. మీడియా చిట్‌చాట్‌లు వద్దు. బయట మీడియాతో వ్యక్తిగతంగా మాట్లాడడానికి వీలులేదు. పార్టీకి నష్టం కలిగించే



లా మాట్లాడేవారి లెక్కలన్నీ రాసుకుంటారు. మళ్లీ ఎన్నికల సమయంలో బీఫాం ఇచ్చేటపుడు వాటిని సరిచూసుకుంటారు. పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడితే వ్యవస్థ మొత్తానికి డ్యామేజ్ అవుతుంది. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుంది. పార్టీ, ప్రభుత్వపరమైన లైన్ లోనే అందరూ స్పందించాలి.

గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చకు సమయం ముగిసింది...

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ ప్రసంగంలో వివరించారు. గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం ఇక అయిపోయింది. భారాస విఫలమైనందునే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అందుకే... మనమేం చేశామనేది గట్టిగా చెప్పాలి. మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే దానిపై అందరూ దృష్టిసారించాలి. సభలో బాగా చదువుకున్న మహిళలున్నారు. వారు కూడా చర్చలో చురుగ్గా పాల్గొనాలి. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలి. చర్చ పక్కదారి పట్టకుండా, సమయం వృధా కాకుండా సమర్థంగా నడిపేలా వారే చూడాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు సబ్జెక్ట్ మాట్లాడటానికి కూడా సమయం ఇవ్వలేదు. అప్పుడు సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదు. ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారు.

ఇది మన ప్రభుత్వం

ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుంది. ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టే ప్రశ్నలను బాగా మాట్లాడే ఎమ్మెల్యేలకు ఇవ్వాలి. గత ప్రభుత్వాలు, కేంద్ర వైఫల్యాలపైన కసరత్తు చేయాలి. విప్‌లు మరింత చురుగ్గా ఉండాలి. బాలూనాయక్ ప్యానల్ స్పీకర్‌గా బాగా చేస్తున్నారు'' అని అభినందించారు.

బాగా సన్నద్ధం కావాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... ''ఉభయసభల సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరవ్వాలి. సభలో మాట్లాడే అంశాలపై మంత్రులు, సభ్యులంతా బాగా సన్నద్ధం కావాలి. మనం దాదాపుగా అన్ని హామీలను నెరవేర్చాం. ఆరు గ్యారంటీల అమలుపై ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి. ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లెక్కలతో సహా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. మూసీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రజంటేషన్ ఇచ్చాక పరిస్థితి మారింది'' అని వివరించారు.

## ఈ నెల 30 వరకు అసెంబ్లీ



ఈ మేరకు సోమవారం స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 31 వరకు నిర్వహించాలని బీఆర్ఎస్ సభ్యులు కోరగా సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కాగా సోమవారం తొలిరోజు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం సమావేశం రేపటికి వాయిదా పడింది. ఈనెల 17,18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, 19న ఉగాది పండుగ సందర్భంగా ఉభయ సభలకు సెలవును ప్రకటించారు. 20న ప్రారంభమయ్యే సమావేశాల్లో అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా ఉభయ సభలకు విరామం, 23 నుంచి సమావేశాలు కొనసాగనున్నాయి. అయితే బీఆర్ఎస్ కోరిక మేరకు ఆదివారం కూడా సమావేశం ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

## సినీనటి ప్రత్యూష మృతి కేసు..

# కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి



ఈకబురు , హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టు తీర్పు మేరకు అమెరికా నుంచి వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. 2002 ఫిబ్రవరి 24న సినీనటి ప్రత్యూష మృతి చెందింది. కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని సిద్ధార్థరెడ్డి, ప్రత్యూష తాగారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రత్యూష మృతి చెందగా.. అతడు కోలుకున్నాడు. ప్రత్యూషది ఆత్మహత్య కాదు.. హత్య అంటూ ఆమె తల్లి న్యాయపోరాటం చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకునేలా సిద్ధార్థరెడ్డి ప్రేరేపించారని ట్రయల్ కోర్టు గతంలో తీర్పునిచ్చింది. ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్షను హైకోర్టు రెండేళ్లకు తగ్గించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ.. ఇటీవల పిటిషన్‌ను కొట్టేసింది. నాలుగు వారాల్లోగా సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు అమెరికాలో ఉన్న అతడు తిరిగి వచ్చి.. నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు.

ఇదీ నేపథ్యం

ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. ఇంటర్ పూర్తయిన తర్వాత సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌కు వెళ్లగా, ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లారు. ఇద్దరి వివాహానికి ప్రత్యూష తల్లి మొదట వ్యతిరేకించినా తర్వాత అంగీకరించారు. సిద్ధార్థరెడ్డి తల్లి మాత్రం ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం వారి వివాహానికి అడ్డంకిగా మారింది. ఆ విషయాన్ని సిద్ధార్థరెడ్డి 2002 ఫిబ్రవరి 23న ఫోన్‌ద్వారా ప్రత్యూషకు చెప్పాడు. సాయంత్రం 5 గంటల సమయంలో పంజాగుట్టలో బ్యూటీపార్లర్‌లో ఉన్న ప్రత్యూషను వెంటబెట్టుకొని కారులో బయటికి వెళ్లాడు. రాత్రి 7.308 గంటల మధ్యలో ఇద్దరూ ప్రాణాపాయస్థితిలో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి వచ్చి చేరారు. ప్రత్యూష 24వ తేదీన కన్నుమూశారు. సిద్ధార్థరెడ్డి మార్చి 9న డిశ్చార్జి అయ్యాడు.

# ప్రగతి ఫలాలు ప్రతి ఇంటికీ..

ఈకబురు : హైదరాబాద్:హైదరాబాద్: అభివృద్ధి చెందిన ప్రపంచ నగరాలు, దేశాలతో తెలంగాణ పోటీ పడుతోందని, విజయవంతమైన నమూనాల ప్రేరణతో 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తామని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడినీ ప్రగతిలో భాగస్వామిని చేస్తున్నామని, అందరికీ అవకాశాలను సృష్టిస్తూ... ప్రగతి ఫలాలను ప్రతి ఇంటికి చేర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రానున్న బడ్జెట్‌ను దీనికి రోడ్‌మ్యాప్‌లా రూపొందించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగానే కాకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. సోమవారం ఆయన శాసనసభ, మండలి బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ హాలులో ఉభయసభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ఇంకా ఏమన్నారంటే...



''తెలంగాణ ప్రజలు శ్రమించే తత్వమున్న శాంతికాముకులు. గత రెండేళ్లుగా మా ప్రభుత్వ కృషితో 202526 సంవత్సరానికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరింది. ఇది 10.7% వృద్ధిరేటును ప్రతిబింబిస్తోంది. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99%. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరుకుంది. ద్రవ్యోల్బణాన్ని 0.2 శాతానికి పరిమితం చేస్తూ ధరల స్థిరత్వాన్ని కాపాడాం.

పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్

తెలంగాణలో 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా. అందుకే పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నాం. జీహెచ్‌ఎంసీని ఇటీవలే 3 కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటిన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించాం. హైడ్రా ద్వారా 1,045 ఎకరాల ప్రభుత్వ భూమిని, రూ.60 వేల కోట్ల విలువైన ప్రజా ఆస్తులను కాపాడాం. ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీలోని బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తాం. బుల్లెట్ రైళ్లకు శంషాబాద్ కేంద్రంగా మారబోతోంది. వరంగల్, ఆదిలాబాద్‌లకు కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయి.

మూసీ ప్రక్షాళనలో తొలిదశలో భాగంగా హైదరాబాద్‌లో హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి చేపడతాం.

ఎగమతుల్లో ఏడో స్థానం

మన ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామిక రంగం రూ.3.04 లక్షల కోట్లను సమకూరుస్తోంది. ఎగుమతుల్లో దేశంలో ఏడోస్థానంలో ఉన్నాం. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గ్లోబల్ సమిట్ ద్వారా రూ.5.72 లక్షల కోట్లు, బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1,700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. హైదాబాద్ జీసీసీలకు అడ్డాగా మారింది. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు చేపట్టాం. కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటికి తరలిస్తున్నాం.

రైతులకు భరోసా

రాష్ట్ర వ్యవసాయ రంగానికి 202526లో రూ.26,684 కోట్లు కేటాయించాం. వానాకాలం(2025)లో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లను విడుదల చేశాం. నిరుడు ఆహారధాన్యాల ఉత్పత్తి 236.87 లక్షల టన్నులకు చేరుకుంది. రికార్డు స్థాయిలో 71.86 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం.

పెండింగ్‌లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో పూర్తిచేస్తాం. నరేగా ద్వారా 6.52 కోట్ల పనిదినాల ఉపాధి కల్పించాం. ఇంధన రంగంలో రాష్ట్ర ఒప్పంద సామర్థ్యం 23,187 మెగావాట్లకు చేరింది. ఇందులో 44.55% పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి వస్తోంది.

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం తెచ్చాం. భూధార్ గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెట్టాం. కొత్తగా 15.12 లక్షల రేషన్ కార్డులిచ్చాం. 3.38 కోట్ల మందికి సన్నబియ్యాన్ని అందిస్తున్నాం. నిరుపేదల కోసం 4లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. తెలంగాణ నూతన విద్యా విధానం రూపకల్పనకు ఒక కమిటీని వేశాం.

మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తున్నాం. మహాలక్ష్మి పథకం ద్వారా వారికి రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయి. గృహజ్యోతి కింద 53.09 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం. సుమారు 1,15,000 మంది ప్రజాప్రతినిధులు కొత్తగా ఎన్నికయ్యారు. ప్రజావాణికి వచ్చిన 64,697 పిటిషన్లలో 47,670 పరిష్కరించాం. ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూ.1.20 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టాం.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

రాష్ట్రంలో డ్రగ్ సమస్య నిర్మూలనకు ఈగల్ బృందాన్ని ఏర్పాటు చేశాం. దీనికి 59 వేల మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్ మద్దతిస్తున్నారు. టీషీమ్స్, టీసేఫ్ సర్వీసుల ద్వారా మహిళలకు భద్రత కల్పిస్తున్నాం.

ఆరోగ్య మౌలిక సదుపాయాలకు రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రులు, నిమ్స్ విస్తరణతోపాటు 17 వైద్య కళాశాలలు నిర్మిస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద కవరేజీని రూ.10 లక్షలకు పెంచాం. 23.51 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్యపథకం అమలు చేస్తాం.

దేశంలో తొలిసారి కులగణన చేపట్టాం

దేశంలోనే మొదటిసారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను నిర్వహించాం. సర్వే ఫలితాల ఆధారంగా, విద్య, ప్రభుత్వ ఉపాధిలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశాం. 59 షెడ్యూల్డ్ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ చట్టం చేశాం. సమ్మక్కసారలమ్మ జాతరను వైభవంగా నిర్వహించాం. గోదావరి పుష్కరాల కోసం బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను అభివృద్ధి చేయనున్నాం.

**వేగవంతమైన ప్రగతి**

మేం అంచెలంచెలుగా కాకుండా, ఆర్థిక వ్యవస్థలో వేగవంతమైన వృద్ధిని సాధించే దిశగా పయనిస్తున్నాం. తెలంగాణలోని ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించేందుకు, గౌరవాన్ని పెంపొందించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది'' అని స్పష్టంచేశారు.

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

సిధారెడ్డి గారి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో నందిని సిధారెడ్డి ఎన్నో పరిశోధనాత్మక రచనలతో సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాహితీ రంగంలో సిధారెడ్డి మరెన్నో శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాంరాం?

**ఈ-కబురు , హైదరాబాద్ :**


ఈకబురు , జగిత్యాల,: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ మారడానికి ఆయన ముహూర్తం సిద్ధం చేసుకున్నారని జగిత్యాల జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నెల 25 లేదా 26వ తేదీన కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పనున్నట్లు సమాచారం. ఉగాది తర్వాత శ్రీరామ నవమి పర్వదినానికి ముందు జీవన్‌రెడ్డి.. కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరతారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై నిర్ణయం తీసుకోవటానికి ఆయన తన ప్రధాన అనుచరులు, కార్యకర్తలతో త్వరలో సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ మేరకు జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరులకు సంకేతాలు అందినట్లు సమాచారం. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని జీవన్‌రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలను ఆయన అనుచరులు తొలగించడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్‌రెడ్డి టచ్‌లో ఉన్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన మాకునూరి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక విషయంలోనూ మనస్తాపానికి గురయ్యారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.



కాంగ్రెస్‌లో ఉండే పరిస్థితి లేదు

కాంగ్రెస్‌లో కొనసాగడంపై ఆలోచించుకునే పరిస్థితి వచ్చింది. ఆ పార్టీలో ఉండే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఎప్పుడు, ఏ సందర్భం అనే అంశం భవిష్యత్ నిర్ణయిస్తుంది. కేసీఆర్, కేటీఆర్‌లతో టచ్‌లోకి వెళ్లినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. ఇప్పటివరకు ఎవరితోనూ చర్చలు జరపలేదు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## నార్సింగిలో దారుణం.. ఆరేళ్ల బాలికపై హత్యాచారం



చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ పుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## రాజీవ్ నగర్ తాగునీటి సమస్యను

# వెంటనే పరిష్కరించాలి : ఆంజనేయులు సాగర్



రాజీవ్ నగర్ సమస్యపై వినతి పత్రం సమర్పిస్తున్న ఆంజనేయులు సాగర్



జలమండలి మేనేజర్ ను సన్మానిస్తున్న దృశ్యం

**తాగునీటి సరఫరా మెరుగుపరచాలని అధికారులకు వినతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎం. ఆంజనేయులు సాగర్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జలమండలి మేనేజర్ హరి శంకర్ ను కలిసిన ఆంజనేయులు సాగర్ రాజీవ్ నగర్ కాలనీ తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో గల ఎత్తైన ప్రాంతంలో కొన్ని ఇళ్లు ఉండడం కారణంగా అక్కడి నివాసితులకు సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎత్తైన ప్రాంతం కారణంగా అక్కడి ఇళ్లకు సరిపడా నీరు చేరేలా ప్రత్యేకంగా బూస్టర్ మోటార్ ఏర్పాటు చేయాలని, అలాగే నీటి పైప్‌లైన్ ఒత్తిడిని పెంచి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని విన్నవించారు. దీనితో పాటు సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తాత్కాలికంగా ఆ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన జలమండలి జనరల్ మేనేజర్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సాగర్ తో పాటు చిన్న సాగర్, నరసింహ, వెంకటేష్, రోహిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు వెన్నుపోట్లు..

# రాహుల్‌కి వెయ్యికోట్లు!

ఈకబురు హైదరాబాద్, : తెలంగాణను ఏటీఎంలా మార్చి ఏఐసీసీకి సమర్పించడంలో కాంగ్రెస్ సర్కారుకు ఉన్న శ్రద్ధ.. పేదలమీద లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతన్నలకు వెన్నుపోట్లు పొడుస్తూ... రాహుల్ గాంధీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామంటున్నారని, అన్నివర్గాలనూ మోసం చేస్తున్న ప్రభుత్వ తీరును ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. సోమవారం అసెంబ్లీకి వెళ్లే ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ అమరవీరుల స్థూపంవద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, మొదటి కేబినెట్ సమావేశంలో వీటికి చట్టబద్ధత కల్పిస్తామన్న రాహుల్‌గాంధీ హామీ నేటికీ అమలు కాలేదన్నారు.

# భారత్‌కు చేరుకున్న 'శివాలిక్'



దిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎల్పీజీని మోసుకొచ్చిన శివాలిక్ ట్యాంకర్ సోమవారం భారత్‌లోని గుజరాత్ ముంద్రా పోర్ట్‌కు వచ్చింది. ఈ శివాలిక్ నౌకలో 45,000 మెట్రిక్ టన్నుల గ్యాస్ భారత్‌కు వచ్చిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 80 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌తో వస్తోన్న 'జగ్ లడ్కీ' నౌక మంగళవారం భారత్‌కు చేరుకుంటుందని నౌకాయాన మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. అలాగే పర్షియన్ గల్ఫ్‌కు పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిల్లో 616 మంది నావికులు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు రెండురోజుల క్రితం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. అందులో ఒకటి శివాలిక్ కాగా.. మరొకటి నందాదేవి. శివాలిక్ తాజాగా భారత్ చేరుకోగా.. మంగళవారం ఉదయం 'నందాదేవి' కూడా 45 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్‌ను తీసుకొని కాండ్లా పోర్టుకు రానుంది.

## నేడు, రేపూ తెలంగాణలో

# తేలికపాటి వర్షాలు



సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, నారాయణపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 6.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంగళ, బుధవారాల్లో చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచించింది. ఈదురు గాలులు 40 నుంచి 50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటలకు, తోటలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని అధికారులు సూచిస్తున్నారు. వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు పడిపోయాయి.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ

# ఇళ్లపై కార్యాచరణ

ఈకబురు హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో నివసించే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రెండు పడకల గదుల ఇళ్లపై శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు.

''క్యూర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కావొద్దు. రెండు పడకల గదుల ఇళ్లు పొంది అద్దెకు ఇస్తున్న వారికి, ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచుతున్న వారికి నోటీసులు జారీ చేయాలి. నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలి. లబ్ధిదారుల నుంచి తాము ఇక్కడే నివాసం ఉంటామని, లేకపోతే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని.. వారి నుంచి హామీ పొందాలి. నాలుగు జిల్లాల పరిధిలోని కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస వసతులను తప్పనిసరిగా కల్పించాలి. ఈ విషయంలో జీహెచ్ఎంసీ సహకారం తీసుకోవాలి. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేయాలి. అసంపూర్తిగా ఉన్న రెండు పడకల గదుల టవర్లను వెంటనే పూర్తిచేయాలి.

పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు కేటాయించాలి. కాలనీలో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదికన కాకుండా వేలం పద్ధతిలో విక్రయించాలి. ఇక్కడ వచ్చిన డబ్బులను సొసైటీ, ప్రభుత్వం పేరిట సంయుక్త ఖాతాలో జమ చేయాలి. ప్రజాప్రయోజనాల కార్యాలయాల కోసం వీటిలో కొంత కేటాయించాలి. ఈ విషయంలో సహకారశాఖ సమన్వయంతో ముందుకు పోవాలి'' అని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎండీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టిస్తాం



హైదరాబాద్ మార్చ్ 16 (ఈకబురు, ); తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పనే చరిత్రను చెరిపివేయడం అన్నారు. అది కుదరకపోతే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో ఈరోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంపై స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన ఆ విగ్రహం తెలంగాణ చరిత్రను అమానించేలా ఉందన్నారు. బతుకమ్మ లేకుండా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ఎంతమాత్రం కూడా ప్రతిరూపం కాదని చెప్పారు. సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని అన్నారు. తమ ములాలను మదిలో తలుస్తూ తెలంగాణ బిడ్డలంతా కూడా ఉద్యమ సందర్భంలో తెలంగాణ తల్లికి అపురూపంగా ఇచ్చిన రూపమే బతుకమ్మతో కూడిన తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రాష్ట్రోద్యమ కాలంలో ఏర్పరచుకున్న తల్లి రూపురేఖలు మార్చడం, ఉద్యమ గుర్తులను చెరిపేయటమంటే అది మూర్ఖపు పనేనని ఆమె అన్నారు. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపుతున్నానని భ్రమిస్తూ రేవంత్ రెడ్డి అల్ప సంతోషంలో ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక... అమరుల త్యాగాలను ఒడిసి పట్టుకున్న నాటి ఉద్యమ తెలంగాణ తల్లిని అదే చోట ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా కాంగ్రెస్ కు ఆఫీస్ కు తరలిస్తామని తేల్చిచెప్పారు.

--విశారదన్ మహరాజ్ అరెస్ట్ అక్రమం

ఖమ్మం వెలుగుమట్ల బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ను పోలీసులు అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖండించారు. ఈ అరెస్ట్ అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన విశారదన్ మహరాజ్ ను పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బంది పెట్టటం దారుణమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

--తెలంగాణకే గర్వకారణం

ప్రముఖ కవి, అధ్యాపకులు నందిని సిధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఎంతో సంతోషానిచ్చిందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన ఆయనకు ఈ అవార్డు రావటం తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. వచన కవిత్వ విభాగంలో నందిని సిధారెడ్డి గారు రచించిన "అనిమేష" కవితా సంపుటికి పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు

## కాల్పులు జరిపి

# తప్పించుకోవాలని..



తాము పోలీసులమని, సోదాలకు వచ్చామని చెబుతున్నా నమిత్ శర్మ మాత్రం తమను లక్ష్యంగా చేసుకొని కూడా ఒక రౌండ్ కాల్పులు జరిపాడని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. అయితే ఆ బుల్లెట్ ఎవరికీ తగలకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. కాల్పుల శబ్దాలు వినగానే తాము అప్రమత్తం అయ్యామని.. అదే సమయంలో 'కాల్చి పారేయండి.. మొత్తం నేను చూసుకుంటాను. ఏం జరిగినా నాదే బాధ్యత' అంటూ ఒకరు గట్టిగా అరిచినట్లు వినిపడిందని వివరించారు. తమను భయభ్రాంతులకు గురిచేసి కాల్పులు జరిపి ఫాంహౌస్ నుంచి తప్పించుకొని పారిపోవాలని అక్కడున్న వారు ప్లాన్ వేశారని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం, ఎక్సైజ్ చట్టాలతోపాటు ఆయుధాల చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు.. కాల్పులతో సంబంధం ఉన్న పైలట్ రోహిత్‌రెడ్డి, అతని సోదరుడు రితేశ్‌రెడ్డి, నమిత్ శర్మలను అరెస్ట్ చేశారు. కాల్పులకు తెగబడ్డ నమిత్ శర్మను ఏ-1గా, ఫాంహౌస్ యజమాని, పార్టీ ఏర్పాటు చేసిన పైలట్ రోహిత్‌రెడ్డిని ఏ-2గా, అతడి సోదరుడు, కాల్పుల జరిగిన తుపాకీ లైసెన్స్ కలిగిన రితేశ్‌రెడ్డిని ఏ-3గా పేర్కొన్నారు. పోలీసులపై హత్యాయత్నం, వారి విధులను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలను తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

మరింత కిక్కు కోసమే మద్యంలో కొకైన్..

రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్న వివరాల ప్రకారం.. మత్తు కిక్కు కోసమే టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, వారి మిత్రులు మద్యంలో కొకైన్ కలుపుకొని తాగారు. పార్టీని రంజుగా ఎంజాయ్ చేసేందుకే ఖరీదైన పలు బ్రాండ్ల మద్యంతోపాటు కొకైన్ తెప్పించుకున్నారు. పోలీసుల సోదాల అనంతరం పార్టీలో పాల్గొన్న వారికి యూరిన్ టెస్ట్‌లు, అనంతరం రక్త పరీక్షలు నిర్వహించగా పుట్టా మహేశ్, రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, కౌశిక్ రవి, నమిత్ శర్మలకు పాజిటివ్ వచ్చింది. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో నిర్ధారణ అయింది. పార్టీలో వాడిన కొకైన్‌ను తానే తెచ్చానని కౌశిక్ రవి పోలీసుల ఎదుట అంగీకరించాడు. సిమ్లాలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి డ్రగ్స్ పార్టీ కోసమే కొకైన్‌ను ఒక్కో గ్రాము రూ. 15,000 చొప్పున చెల్లించి కొనుగోలు చేసినట్లు కౌశిక్ అంగీకరించాడు.

# రాజ్యసభకు నితిన్, నితీశ్ ఎన్నిక

వాస్తవానికి బిహార్‌లో నలుగురు సభ్యులు ఎన్నిక కావడానికి సంపూర్ణ మెజారిటీ ఉంది. ఐదో అభ్యర్థికి కొన్ని ఓట్లు తక్కువ ఉన్నాయి. దీంతో ప్రతిపక్షం ఆర్జేడీ.. అమరేంద్ర ధారి సింగ్‌ను బరిలోకి దింపింది. అయితే ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులంతా విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు ఓటేయలేదు. ఆర్జేడీ ఎమ్మెల్యే ఒకరు గైర్హాజరయ్యారు.

బిహార్‌లోని బంకీపుర్ నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆ స్థానాన్ని వదులుకుంటున్నారు.

హరియాణాలో వివాదం

హరియాణాలోని రెండు రాజ్యసభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. భాజపా అభ్యర్థి సంజయ్ భాటియా, కాంగ్రెస్ అభ్యర్థి కరంవీర్ బోధ్, స్వతంత్ర అభ్యర్థి సతీశ్ నందల్ రంగంలో ఉన్నారు. 4 గంటలకు పోలింగ్ పూర్తయింది. 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. కానీ రహస్య ఓటింగ్ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ భాజపా, కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బ్యాలెట్ పేపరును మడవకుండా బాక్సులో వేశారని పోలింగ్ ముగియడానికి ముందే భాజపా ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ కూడా భాజపా సభ్యుడు అనిల్ విజ్‌పై ఫిర్యాదు చేసింది. ఆయన రహస్య ఓటింగ్ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించింది. రాజ్యసభ ఎన్నికల సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నం జరిగిందంటూ ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు.

ఒడిశాలో స్వతంత్ర అభ్యర్థీ గెలుపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశాలో అధికారంలో ఉన్న భాజపా మూడు రాజ్యసభ స్థానాలను దక్కించుకుంది. ఒకటి బిజూ జనతాదళ్ గెలుచుకుంది. సోమవారం పోలింగ్ తర్వాత జరిగిన ఓట్ల లెక్కింపులో భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్, ప్రస్తుత ఎంపీ సుజీత్ కుమార్, భాజపా మద్దతిచ్చిన స్వతంత్ర అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి దిలీప్ రే విజయం సాధించారు. ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగి ఎన్డీయే మూడో అభ్యర్థి విజయం సాధించినట్లు సమాచారం.

**గతంలోనే 26 మంది ఏకగ్రీవం**

రాజ్యసభ ఎన్నికల్లో 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇప్పటికే ఎన్నికల సంఘం ప్రకటించింది. వారిలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆర్పీఐ (ఏ) అధినేత రాందాస్ అఠావలె, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, అన్నాడీఎంకే నాయకుడు తంబిదురై, భాజపా సీనియర్ నాయకుడు వినోద్ తావ్డే, తృణమూల్ నేత బాబుల్ సుప్రియో తదితరులున్నారు.

## 11ఏళ్లలో..
# ₹9.75 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్



దిల్లీ: గడిచిన 11 ఏళ్లలో దేశంలో రూ.9.75 లక్షల కోట్ల విలువైన రుణాలను బ్యాంకులు రైటాఫ్ చేసినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. 201920 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.1.59 లక్షల కోట్ల విలువైన రుణాలను రైటాఫ్ చేయగా.. 202425 ఆర్థిక సంవత్సరంలో కనిష్ఠంగా రూ.47,568 కోట్ల రుణాలను సాంకేతికంగా రద్దు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌కు వెల్లడించారు.


201415లో రూ.31,723 కోట్లు; 201516లో రూ.40,416 కోట్లు, 2016 17లో రూ.68,308 కోట్లు; 201718లో రూ.99,132 కోట్లు; 201819లో రూ.1.59 లక్షల కోట్లు చొప్పున రైటాఫ్ చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం నాలుగేళ్లు దాటిన మొండి బకాయిలను బ్యాంకులు రైటాఫ్ చేస్తుంటాయని పేర్కొన్నారు. రైటాఫ్ చేసినంత మాత్రన లోన్ తీసుకున్నవాళ్లు తమ అప్పులను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత మాత్రం మాఫీ కాదని స్పష్టం చేశారు. రైటాఫ్ చేసిన రుణాలను వసూలు చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. బ్యాంకులు తమకు అందుబాటులో ఉన్న వివిధ రికవరీ విధానాల ద్వారా రుణగ్రహీతలపై చర్యలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు.

# టారిఫ్‌లపై స్పష్టత వచ్చాకే ట్రేడ్ డీల్‌పై సంతకాలు: కేంద్రం



దిల్లీ: అమెరికాతో టారిఫ్‌ల విషయంలో స్పష్టత వచ్చాకే వాణిజ్య ఒప్పందంపై ముందుకెళతామని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. వాస్తవానికి ఫిబ్రవరి మొదటివారంలోనే ఇరుదేశాల మధ్య తొలిదశ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్‌నకు ఆమోదం తెలిపాయి. దాని ప్రకారం భారత్‌పై 18 శాతం సుంకాలు విధించేందుకు అమెరికా అంగీకరించింది. ఇందులోభాగంగానే మార్చి నెలలో ఒప్పందంపై సంతకాలు జరగాల్సిఉంది. కానీ, ఇంతలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దీంతో ట్రంప్ అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ 122ను ప్రయోగించి అన్ని దేశాల పైనా 10 శాతం టారిఫ్‌లను విధించారు. ఇవి ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయి. దీంతో టారిఫ్‌ల అంశంపై అస్పష్టత నెలకొంది. ప్రస్తుతం గ్లోబల్ టారిఫ్ ఆర్కిటెక్చర్‌పై అమెరికా పని చేస్తోందని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. అది ఖరారయ్యాక వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరుగుతాయన్నారు. ట్రేడ్ డీల్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలూ లేవని స్పష్టంచేశారు.

## కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు..
# సెన్సెక్స్ 939 పాయింట్లు పైకి



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఓ వైపు భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో కదలాడిన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. దీంతో సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి 1550 పాయింట్ల మేర పైకెగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడే కనిష్ఠాల నుంచి 2 శాతం మేర పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, రిలయన్స్, ఎస్‌బీఐ వంటి అధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. వరుస నష్టాల వేళ ఆయా స్టాక్స్ కనిష్ఠాలకు చేరడంతో ఇదే అదునుగా మదుపర్లు కొనుగోళ్లకు ఉత్సాహం చూపించారు. సెన్సెక్స్ ఉదయం 74,415.79 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,563.92) నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో లాభనష్టాల మధ్య కదలాడిన సూచీ.. ఆఖరి గంటలో భారీగా లాభపడింది. ఇంట్రాడేలో 75,805.27 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 938.93 పాయింట్ల లాభంతో 75,502.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 257.70 పాయింట్ల లాభంతో 23,408.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.42గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటర్నల్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4980 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వడ్డీ రేట్ల కోతపై నీలినీడలు..
# దిగొచ్చిన బంగారం, వెండి ధరలు




దిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు బంగారం, వెండి ధరల పైనా ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. దీంతో ఇప్పటికిప్పుడు అమెరికా ఫెడ్ సహా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీనికితోడు డాలర్ విలువ బలోపేతం కావడం కూడా బంగారం, వెండి గిరాకీ తగ్గడానికి కారణం. సాధారణంగా వడ్డీ రేట్లు తగ్గినప్పుడు బంగారం, వెండికి డిమాండ్ ఏర్పడి తద్వారా వీటి ధరలు పెరుగుతాయి. వడ్డీ రేట్లు అధికస్థాయిలో ఉన్నప్పుడు డిమాండ్ నెమ్మదిస్తుంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 5002 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.38 వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. వెండి కిలో రూ.2.58 లక్షలు పలుకుతోంది.

అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ (MCX) కిలో వెండి ధర మే నెల డెలివరీ కాంట్రాక్టు రూ.4,232 క్షీణించి రూ.2,55,203 పలుకుతోంది. ఏప్రిల్ కాంట్రాక్టు 10 గ్రాముల బంగారం ధర 1.5 శాతం క్షీణించి రూ.1.56 లక్షలుగా ఉంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, పీపుల్స్ బ్యాంక్ చైనా వంటివి ఈ వారంలో వేర్వేరుగా సమావేశమై వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నాయి. దీనిపై ట్రేడర్లు దృష్టిసారించే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. మార్చి నెలలో వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చని ఇప్పటికే మార్కెట్ అంచనా వేస్తోంది.

# యాక్సిస్ క్రెడిట్ కార్డు బెనిఫిట్స్ లో మార్పులు

ఏప్రిల్ 12 నుంచి ఎయిర్‌టెల్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు రివార్డ్ స్ట్రక్చర్‌లో కొన్ని మార్పులు అమల్లోకి రానున్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

ఎయిర్‌టెల్ మొబైల్, బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్ చెల్లింపులపై 25% క్యాష్‌బ్యాక్ కొనసాగుతుంది.

ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ ద్వారా యుటిలిటీ బిల్లులు చెల్లిస్తే 10% క్యాష్‌బ్యాక్ అందుతుంది.

అయితే ప్రతి బిల్లింగ్ సైకిల్‌కు గరిష్ట క్యాష్‌బ్యాక్ పరిమితి ఇప్పుడు బేస్ క్యాష్‌బ్యాక్ క్యాప్‌తో అనుసంధానం అవుతుంది.

స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ వంటి ప్లాట్‌ఫారమ్‌లపై ఇప్పటివరకు ఉన్న 10% క్యాష్‌బ్యాక్ నిలిపివేయనున్నారు.

బదులుగా జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్ వంటి ప్లాట్‌ఫారమ్‌లపై 10% వాల్యూబ్యాక్ అందించనున్నారు.

యెస్ బ్యాంక్ కొత్త ఛార్జీలు

ఏప్రిల్ 1 నుంచి యెస్ బ్యాంక్ యుటిలిటీ బిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ చెల్లింపులపై కొత్త పరిమితులు, ఛార్జీలు అమలు చేయనుంది. కొత్త నిబంధనలు ఇలా..

విద్యుత్, నీరు, గ్యాస్ వంటి యుటిలిటీ బిల్లులపై నెలవారీ ఖర్చు నిర్దిష్ట పరిమితిని దాటితే 1% ఛార్జీ వసూలు చేస్తారు.

కార్డు రకాన్ని బట్టి పరిమితులు ఉంటాయి. యెస్ ప్రైవేట్ క్రెడిట్ కార్డు అయితే నెలకు రూ.1,00,000 వరకు, ప్రీమియం కార్డులైతే రూ.50,000 వరకు, ఇతర కార్డులకు రూ.25,000 వరకు పరిమితులను నిర్ణయించారు.


ఈ పరిమితులను దాటిన తర్వాత చేసిన యుటిలిటీ చెల్లింపులపై 1% ఫీజు వర్తిస్తుంది. అదే విధంగా టోల్, బ్రిడ్జ్ చెల్లింపులు కూడా నిర్దిష్ట పరిమితిని మించితే 1% ఛార్జీ వసూలు చేస్తారు. అయితే ఒక్క లావాదేవీకి గరిష్ట ఛార్జీ రూ.5,000 వరకు మాత్రమే ఉంటుంది.

ఎస్‌బీఐ.. రివార్డ్ పాయింట్ రిడంప్షన్ మార్పులు

ఎస్‌బీఐ కార్డ్ కూడా ఏప్రిల్ 1 నుంచి రివార్డ్ పాయింట్ రిడంప్షన్ విధానంలో కొత్త నియమాలను అమలు చేయనుంది. కొత్త పాలసీ ప్రకారం..

స్టేట్‌మెంట్ క్రెడిట్‌గా నెలకు గరిష్టంగా 60,000 రివార్డ్ పాయింట్లు మాత్రమే రిడీమ్ చేసుకోవచ్చు.

రివార్డ్ పాయింట్ల రిడంప్షన్ 4,000 పాయింట్ల గుణిజాల్లో మాత్రమే ఉంటుంది. అయితే ఎయిర్ ఇండియా ఎస్‌బీఐ సిగ్నేచర్ కార్డ్ వంటి కొన్ని కార్డులకు ఈ నియమాల నుంచి మినహాయింపు ఉంటుంది.







## ఫోన్‌పేకు వార్ సెగ..
# ఐపీఓ సన్నాహాలకు తాత్కాలిక బ్రేక్

వాల్‌మార్ట్ నేతృత్వంలోని ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూకు (Phonepe IPO) తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇప్పటికే సెబీ నుంచి ఆమోదం పొందినా ఈ సంస్థ లిస్టింగ్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితుల వల్ల నెలకొన్న మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ సీఈఓ సమీర్ నిగమ్ వెల్లడించారు. మార్కెట్లలో స్థిరత్వం వచ్చాక మళ్లీ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. త్వరలో పరిస్థితి సద్దుమణుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఫోన్‌పే డిజిటల్ పేమెంట్ యాప్ 2016లో లాంచ్ అయ్యింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి 65 కోట్ల రిజిస్టర్డ్ యూజర్లు, 4.7 కోట్ల మర్చంట్లతో డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో మార్కెట్ లీడర్‌గా ఉంది. డిజిటల్ చెల్లింపులతో పాటు ఇన్సూరెన్స్ అగ్రిగేటర్‌గానూ వ్యవహరిస్తోంది. స్టాక్‌బ్రోకింగ్ యాప్ షేర్‌మార్కెట్, గూగుల్‌కు ప్రత్యామ్నాయ వేదిక ఇండస్ యాప్ స్టోర్‌ను కలిగిఉంది. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ.. ఐపీఓ ద్వారా రూ.10వేల కోట్లు పైనే సమీకరించాలని భావిస్తోంది. సెబీ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ పొందింది. ఈ తరుణంలో పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ఐపీఓకు బ్రేక్ పడింది.ఒక్క ఫోన్‌పేనే కాదు.. మరికొన్ని ఐపీఓలు సైతం ఆలస్యం కానున్నాయి. ఇప్పటికే సుమారు 141 కంపెనీలు నియంత్రణ సంస్థల నుంచి అనుమతి పొంది లిస్టింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఆయా సంస్థలు సంయుక్తంగా రూ.1.64 లక్షల కోట్లు సమీకరించనున్నాయి. ఇందులో సుమారు 80 కంపెనీలకు పబ్లిక్ ఇష్యూను తీసుకురావడానికి 3 నుంచి 9 నెలల గడువు ఉంది. మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో అవి ఆచితూచి వ్యవహరిస్తున్నాయి.

## ఓ తండ్రి పోరాటానికి 'ఆరు ఆస్కార్లు'



ఉత్తమ చిత్రం సహా ఆరు పురస్కారాలు గెలుచుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. సోమవారం ఉదయం (భారతీయ కాలమానం ప్రకారం) లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో జరిగిన 98వ ఆస్కార్ వేడుకలో హాలీవుడ్ కథానాయకుడు లియోనార్డో డికాప్రియో ప్రధానపాత్రలో నటించిన 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమాకి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లేతోపాటు ఉత్తమ చిత్రానికి నిర్మాతగా పాల్ థామస్ అండర్సన్ పురస్కారాలు అందుకున్నారు. ఈ చిత్రం ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లోనూ మెరిసింది. ఉత్తమ నటుడిగా మైఖేల్ బి.జోర్డన్ (సిన్నర్స్), ఉత్తమ నటిగా జెస్సీ బక్లీ (హామ్నెట్) అవార్డులు అందుకున్నారు.



## 'జన నాయగన్' సెన్సార్ వివాదం.. స్పందించిన పవన్ కల్యాణ్


సెన్సార్ వివాదంలో చిక్కుకున్న 'జన నాయగన్' (Jana Nayagan) సినిమా విడుదల వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. రాజకీయ పరంగానే ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకుందంటూ రూమర్స్ వచ్చాయి. వీటిపై ప్రముఖ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (Pawan Kalyan) స్పందించారు. సెన్సార్ బోర్డు స్వతంత్రంగా పని చేస్తుందని, అందులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని అన్నారు. సమస్యను సెన్సార్ బోర్డు వద్ద సరిగ్గా పరిష్కరించుకోలేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎన్డీయేని నిందించడం సమంజసం కాదన్నారు. ఎవరికైనా రూల్ ఒకటే అని గుర్తుచేస్తూ.. తన 'ఓజీ' సినిమా విషయంలో ఎదురైన అనుభవాన్ని వివరించారు. "ఎన్డీయేలో నేను ఓ భాగస్వామిని కాబట్టి 'ఓజీ'కి తాము అనుకున్న సర్టిఫికెట్ వస్తుందని దర్శక, నిర్మాతలు అనుకున్నారు. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ వచ్చింది. దానిని నేను స్వాగతించా. 'సినిమాలో ఇంత వయలెన్స్ పెట్టుకుని 'యూ/ఏ' సర్టిఫికెట్ ఎలా ఆశిస్తున్నారు? అని మా టీమ్‌ని అడిగా" అని అన్నారు. కోలీవుడ్ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నటించిన 'జన నాయగన్' జనవరి 9న విడుదలకు సిద్ధం కాగా.. చివరి నిమిషంలో వాయిదా పడిన విషయం విదితమే. ఈ వివాదం మద్రాసు హైకోర్టుకు చేరింది. ఈ చిత్రాన్ని సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీ మంగళవారం (మార్చి 17) చూడనుందని సమాచారం. ఆ రిపోర్ట్‌ని బట్టి విడుదలపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మధుబాల బయోపిక్‌లో సాయిపల్లవి?

భాషలతో సంబంధం లేకుండా వైవిధ్యమైన చిత్రాలలో నటిస్తూ.. పాత్రలతోనే ప్రేక్షకులలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక సాయిపల్లవి. 'ఏక్ దిన్' సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల్ని పలకరించనున్న ఈ భామ మరో హిందీ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించనున్న నటి మధుబాల బయోపిక్ కోసం ఆమెని సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బయోపిక్‌లో తొలుత హీరోయిన్లు కియారా అడ్వాణీ, అనీత్ పడ్డా పేర్లు వినిపించినప్పటికీ ఇప్పుడు దీనికోసం సాయిపల్లవినే తీసుకోవాలని భావిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం సాయిపల్లవి 'రామాయణ', ధనుష్‌తో కలిసి ఇంకా పేరు ఖరారు చేయని ఓ చిత్రంలో నటిస్తున్నందున బిజీగా ఉందట. షెడ్యూల్లు, డేట్స్ అన్నీ కుదిరితే దీనిపై త్వరలోనే స్పష్టత రానున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పద్మావత్', 'గంగూబాయి కాఠియావాడి' లాంటి చిత్రాలలో ప్రాధాన్యత కలిగిన నాయికా పాత్రలను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ.



## నేనే గెలిచా.. విజ్జూ నా టీమే': రష్మిక ఆసక్తికర పోస్టు



టీవల వివాహ బంధంతో ఒక్కటైన విరోష్ జోడీ.. తమ హల్దీ వేడుకకు సంబంధించిన ఆసక్తికర పోస్టు పెట్టింది. హల్దీ వేడుక ఫొటోలను అభిమానులతో షేర్ చేస్తూ.. ఆ వేడుక రంగులతో హోలీని తలపించిందని, తన జుట్టుపై పడిన రంగు ఇప్పటికీ పోలేదని రష్మిక (Rashmika) పేర్కొన్నారు. "ఆరోజు (ఫిబ్రవరి 25) నిర్వహించిన ఆటలన్నింటిలో నేనే గెలిచా. నా టీమ్ సహకారం వల్లే అది సాధ్యమైంది. విజ్జూ (విజయ్) కూడా నా టీమే" అని తెలిపారు. పెళ్లి వేడుకల్లో భాగంగా తాము ఆతిథ్యం పొందిన ఓ ప్రముఖ హోటల్‌కు థాంక్స్ చెప్పారు.

స్వదేశంలోనే పెళ్లి చేసుకోవాలనుకున్నా: విజయ్

విజయ్ కూడా తమ హల్దీ వేడుక జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఓ పోస్టు పెట్టారు. 'స్వదేశంలోనే పెళ్లి చేసుకోవాలని, అదీ అవుట్ డోర్‌లో అయితే బాగుంటుందని అనుకున్నా. అందుకు ఉదయ్‌పుర్ కన్నా బెస్ట్ ప్లేస్ లేదని అనిపించింది. అక్కడ నిర్వహించిన హల్దీ వేడుకలో కుటుంబంతో కలిసి బాగా ఎంజాయ్ చేశాం' అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 26న విజయ్ రష్మిక వివాహం జరిగిన సంగతి తెలిసిందే. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్'లో కలిసి నటించిన ఈ జంట.. పెళ్లి తర్వాత నటిస్తున్న సినిమా 'రణబాలి'. ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

## ఆస్కార్ నివాళుల జాబితాలో కోట శ్రీనివాసరావు.. ధర్మేంద్ర





అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో 'In Memoriam' సెగ్మెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు (Oscars). ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు (Kota Srinivasa Rao) వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.

## నైజాంలో 'ఉస్తాద్ భగత్‌సింగ్' బుకింగ్స్ ఓపెన్.. టికెట్ ధరలు ఎలా ఉన్నాయంటే?

హైదరాబాద్: పవన్ కల్యాణ్ (Pawan Kalyan) హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కించిన సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' (Ustaad Bhagat Singh). ఈ చిత్రం ఉగాది సందర్భంగా ఈ నెల 19న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నైజాంలో ఆన్‌లైన్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఈ మేరకు తెలంగాణలో గురువారం ఉదయం 7:30కే షో పడనుంది. ఇప్పటికైతే టికెట్ ధరల పెంపు లేదు. రెగ్యులర్ రేట్లకే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. బుకింగ్స్ ఓపెన్ అయిన క్షణాల్లోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

గురువారం తెల్లవారుజామున (4గంటల తర్వాత) బెనిఫిట్ షో ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. దాని టికెట్ ధరను రూ.500 (పన్నులతో కలిపి)గా నిర్ణయించారు. అలాగే సినిమా విడుదల నాటి నుంచి పది రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించింది. సింగిల్ స్క్రీన్‌లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 చొప్పున పెంచుకునే అవకాశమిచ్చింది.




## అదే తమన్ సంస్కారం.. బీజీఎం అంతకుమించి: హరీశ్ శంకర్




పవన్ కల్యాణ్ (Pawan Kalyan) హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ (Harish Shankar) తెరకెక్కించిన కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' (Ustaad Bhagat Singh). ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం సందడిగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో తాను చిత్ర బృందంలోని పలువురు కీలక వ్యక్తుల గురించి మాట్లాడలేకపోయానని దర్శకుడు తాజాగా తెలిపారు. దానికి గల కారణాన్ని వివరిస్తూ.. సినిమా కోసం కష్టపడిన ఆయా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు స్పెషల్ వీడియోను విడుదల చేశారు. డైరెక్టర్ ఏమన్నారంటే..?

"పవన్ కల్యాణ్‌ను వెయిట్ చేయించామనే టెన్షన్, నిర్విరామంగా ప్రీ ప్రొడక్షన్ పనులు చేస్తుండటంతో వచ్చిన అలసట వల్ల టీమ్‌లో కొందరి గురించి మాట్లాడటం మర్చిపోయా. ముఖ్యంగా రాశీఖన్నా (Raashii Khanna) గురించి చెప్పాలి. ఈ సినిమా కథ కూడా వినకుండానే ఆమె నటించింది. పవన్ కల్యాణ్‌తో కలిసి యాక్ట్ చేయాలన్నది ఆమె డ్రీమ్. ఈ ఇద్దరి మధ్య సాగే సన్నివేశాలు ప్రేక్షకులకు మంచి వినోదం పంచుతాయి. బాబ్జీ, రవి కట్ చేసిన టీజర్, ట్రైలర్లకు వచ్చిన స్పందన ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. తమన్ (Thaman)కు ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా తక్కువే. బావా (తమన్‌ను ఉద్దేశించి).. నేను ఏ పరిస్థితుల్లో ఈ సినిమా బీజీఎం కోసం నిన్ను సంప్రదించానో నీకు తెలుసు. ఓ మ్యూజిక్ డైరెక్టర్‌గా కాకుండా కుటుంబ సభ్యుడిగా నువ్వు పడుతున్న కష్టానికి థాంక్స్ సరిపోదు. పవన్ సినిమాలకు తమన్ బ్యాక్‌గ్రౌండ్ ఏ రేంజ్‌లో ఉంటుందో ఇప్పటికే మీరు చూశారు.

## ఏది రాసిపెట్టుంటే.. అదే జరుగుతుంది
## ..టెస్టు క్రికెట్‌పై సూర్యకుమార్



కెరీర్‌లో కేవలం ఒకే ఒక్క టెస్టు ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్.. వన్డేల్లోనూ (37 మ్యాచులు) ఎక్కువగా కనిపించలేదు. కేవలం పొట్టి ఫార్మాట్‌లోనే వందకు పైగా మ్యాచులు ఆడిన సూర్య ఇప్పుడు భారత టీ20 జట్టుకు సారథిగా ఉన్నాడు. ఇటీవల వరల్డ్ కప్‌నూ టీమ్ఇండియాకు అందించాడు. బీసీసీఐ నమన్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సూర్య ఎదుట ఓ ప్రశ్న ఎదురైంది. దానికి అతడు ఇచ్చిన సమాధానం అభిమానులను ఆకట్టుకుంది. ప్రశ్న: టెస్టుల్లో ఆడకపోవడానికి.. కేవలం టీ20ల్లో ఆడటానికి కారణం ఏమైనా ఉందా?

సూర్య సమాధానం: టెస్టుల్లో కాదు..నేను ఒకే ఒక్క టెస్టు ఇన్నింగ్స్ మాత్రమే ఆడా (నవ్వుతూ). నేనిప్పుడు పొట్టి ఫార్మాట్‌లో మాస్టర్‌ను అయ్యా. టీ20ల్లో ఆడటమే నాకెంతో బాగుంది. పదేళ్లు రెడ్‌బాల్ క్రికెట్ ఆడా..

''ఏది రాసిపెట్టి ఉంటే జీవితంలో అదే జరుగుతుంది. తొలుత నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినపుడు రెడ్‌బాల్ క్రికెట్ ఆడా. దాదాపు పదేళ్లు రంజీ ట్రోఫీలో ఆడా. ముంబయికి ప్రాతినిధ్యం వహించా. ఇక్కడ ప్రతిఒక్కరూ రెడ్‌బాల్ క్రికెట్‌తోనే మొదలుపెడతారు. క్రమంగా పరిమిత ఓవర్ల క్రికెట్ ఆట వైపు వచ్చినప్పుడు ఇక్కడే సౌకర్యంగా అనిపించింది. మరీ ముఖ్యంగా టీ20లకు బాగా సెట్ అయ్యా. వన్డేల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించినా కానీ కుదరలేదు. నాకు టెస్టు క్రికెట్‌పై ప్రేమ లేదని చెప్పను. ఎందుకంటే 2010 నుంచి 2020 వరకూ రంజీల్లో ఆడా. ఆ ఫార్మాట్‌నూ ఆస్వాదించా. ఎవరైనా సరే టెస్టు క్రికెట్ ఆడే అవకాశం వస్తే వద్దంటారా?'' అని సూర్య వ్యాఖ్యానించాడు.

వన్డేల్లో మూడు పాత్రలు..

''నాకున్న వన్డే క్రికెట్ అనుభవం ప్రకారం.. ఈ ఫార్మాట్‌లో మూడు భిన్నమైన మార్గాల్లో ఆడాల్సి ఉంటుంది. కొన్నిసార్లు త్వరగా వికెట్లు పడి ముందుగా క్రీజ్‌లోకి వెళ్తే టెస్టుల్లో మాదిరిగా నెమ్మదిగా ఆడాలి. మధ్య ఓవర్లలో స్ట్రైక్‌రేట్ పెంచుకుంటూ పోవాలి. ఇక ఆఖర్లో టీ20ల మాదిరిగా చెలరేగాలి. అందుకేనేమో నాకు ఈ వన్డే ఫార్మాట్ సరిగా అర్థంకాలేదు అనిపిస్తుంది. చూసేందుకు బాగానే ఉన్నా.. ఎన్నో సవాళ్లు మన ముందుంటాయి. నేను వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌లో ఆడా. అభిమానుల నుంచి విపరీతమైన ఆదరణ దక్కింది. మూడు ఫార్మాట్లకు ఉన్న ఆకర్షణ పూర్తిగా భిన్నమైంది. భారత్‌లో టాలెంట్‌కు కొదవేంలేదు. ఒకేసారి రెండు లేదా మూడు టీమ్‌లను సిద్ధం చేసుకొనేంత వెసులుబాటు ఉంది'' అని సూర్య వెల్లడించాడు.

## అంకితభావంతోనే సక్సెస్..
## గేల్ రికార్డుపైనే నా గురి: వైభవ్ సూర్యవంశీ



ఐపీఎల్ 2026లోనూ క్రికెట్ అభిమానుల దృష్టి వైభవ్ సూర్యవంశీ పైనే. గతేడాది 13 ఏళ్ల వయసులో అడుగుపెట్టి.. సంచలన ఆటతో అదరగొట్టాడు. అండర్ 19 వరల్డ్ కప్‌లోనూ దూకుడుగా ఆడాడు. ఈ ఏడాది కూడా అదేతీరు కొనసాగిస్తే జాతీయజట్టుకు ఎంపికయ్యే అవకాశాలు మెరుగవుతాయి. అయితే, ఈ ఏడాది తన లక్ష్యాలేంటో తాజాగా ఓ చిట్‌చాట్‌లో వైభవ్ సూర్యవంశీ వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్‌కు కప్ అందించడంతో పాటు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టడంపై దృష్టి పెట్టినట్లు తెలిపాడు. అయితే తాను ఎప్పుడూ గేమ్ పైనే ఫోకస్ చేస్తానని, బయట జరిగే చర్చ గురించి ఆలోచించనని స్పష్టం చేశాడు. 'నేనేం చేయగలనో దానిపైనే దృష్టిపెడతా. మైదానంలో బాగా ఆడితే ఆటోమేటిక్‌గా మనపై అందరి అటెన్షన్ ఉంటుంది. ఒకవేళ సరిగ్గా ఆడకపోయినా ఏవో మాటలు అంటారు. కానీ, నేనెప్పుడూ వాటిని పట్టించుకోను. నా ఆట పైనే ఫోకస్ చేస్తా. తొలిసారి నేను అండర్ 19 వరల్డ్ కప్ ఆడా. ఫైనల్‌లో సెంచరీ చేయడం గర్వంగా ఉంది. జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో నావంతు భాగస్వామ్యం అందించగలిగాను. అలాగే రాజస్థాన్ రాయల్స్‌కు కప్ అందించాలి. ఈ ఏడాది నా లక్ష్యాల్లో అదొకటి. అంకితభావంతో పనిచేస్తే సక్సెస్ వస్తుందని నమ్ముతా'' అని వైభవ్ తెలిపాడు.

ఆ మూడింట్లో ఏదంటే?

బీసీసీఐ నమన్ అవార్డుల కార్యక్రమంలో వైభవ్‌కు క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే మూడు ఛాయిస్‌లు ఇచ్చి ఏది ఎంచుకుంటావని ప్రశ్నించారు. ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు, ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేయడం, క్రిస్ గేల్ 175 పరుగుల రికార్డును అధిగమించడం.. వీటిల్లో ఏది టార్గెట్? అని అడిగారు. దానికి వైభవ్ స్పందిస్తూ ''క్రిస్ గేల్ చేసిన 175 రన్స్ రికార్డును అధిగమించడం' అంటూ బదులిచ్చాడు.

## అది 'బ్లడ్ మనీ'...
## పాక్ క్రికెటర్‌ను కొనుగోలు చేయడంపై గావస్కర్

ది హండ్రెడ్ లీగ్ కోసం సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ లీడ్స్‌తో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓనర్ సన్ గ్రూప్. దీంతో ఎస్ఆర్‌హెచ్‌ను ఈ ఐపీఎల్ నుంచి బహిష్కరించాలనే డిమాండ్లూ వచ్చాయి. తాజాగా ఈ అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాక్ క్రికెటర్లకు ఫీజు చెల్లించడమంటే భారతీయుల మరణానికి కంట్రిబ్యూట్ చేసినట్లేనని పేర్కొన్నారు. భారత్‌కు చెందిన యాజమాన్యాలు కలిగిన ఏ జట్టైనా సరే పాక్ క్రికెటర్లను దూరంగా పెట్టాల్సిందేనని స్పష్టంచేశారు. 2008లోనే ఐపీఎల్ నుంచి పాక్ క్రికెటర్లను బహిష్కరించామని గుర్తు చేశారు. ''భారత్‌కు చెందిన ఫ్రాంచైజీ యాజమాన్యం ది హండ్రెడ్ లీగ్‌లో పాక్ క్రికెటర్‌ను తీసుకోవడం ఇప్పుడు అలజడిని సృష్టించింది. 2008లో ముంబయి దాడులు జరిగినప్పటినుంచి పాక్ క్రికెటర్లను దూరం పెట్టాం. ఐపీఎల్‌లో నుంచి బహిష్కరించాం. ఫీజు రూపంలో వచ్చిన మొత్తానికి పాకిస్థానీ ప్లేయర్ తన ప్రభుత్వానికి ఆదాయ పన్ను చెల్లిస్తాడు. ఆ సొమ్ముతో అతడి ప్రభుత్వం ఆయుధాలను కొనుగోలు చేసి.. భారత్ పైనే ప్రయోగిస్తుంది. అంటే పాక్ ప్లేయర్‌కు చెల్లించే ఫీజు పరోక్షంగా భారత ప్రజలు, సైనికుల ప్రాణాలు పోవడానికి కారణమవుతోంది. అందుకే, ఎవరైనా సరే పాక్ క్రీడాకారులను, సినిమా వారిని పక్కన పెట్టేయాల్సిందే'' అని గావస్కర్ వెల్లడించారు.

దానికంటే ముఖ్యమా..?

''మన దేశానికి చెందిన సంస్థ అయినా.. మన యాజమాన్యం కింద ఉన్న విదేశీ అనుబంధ సంస్థ అయినా సరే పాక్ క్రికెటర్లకు డబ్బు చెల్లించడం వల్ల భారతీయుల ప్రాణనష్టానికి పరోక్షంగా కారణమవుతున్నట్లే. న్యూజిలాండ్‌కు చెందిన డానియల్ వెట్టోరీకి ఇది అర్థంకాకపోవచ్చు. అందుకే, పాక్ ఆటగాళ్లను తీసుకోవాలని భావించి ఉండొచ్చు. అదే సమయంలో యాజమాన్యం పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి. భారతీయుల జీవితాల కంటే ఈ టోర్నీలో గెలవడం అంత ముఖ్యమా?'' అని గావస్కర్ ప్రశ్నించారు. అబ్రార్‌ను తీసుకోవడంపై వేలం ముగిసిన తర్వాత డానియల్ వెట్టోరీ స్పందించాడు. తాము ఇంగ్లాండ్ స్పిన్నర్ అదిల్ రషీద్ కోసం ప్రయత్నించామని.. అది సక్సెస్ కాకపోవడంతో అబ్రార్ వైపు వెళ్లినట్లు చెప్పాడు. తారిక్ ఉస్మాన్ కోసమూ ప్రయత్నించినట్లు పేర్కొన్నాడు.

# టీమిండియా హెడ్‌కోచ్‌గా ధోని రావాలి: గంభీర్



టీమిండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ నవ్వడం అరుదు. ఎల్లప్పుడూ గంభీరంగానే కనిపించే ఈ ఢిల్లీ స్టార్ ముఖంపై అప్పుడప్పుడు మాత్రమే చిరునవ్వులు చూడగలం. ఇటీవల భారత్ టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన సందర్భంగా గౌతీ నవ్వులు చిందించడం అభిమానులకు కనువిందు చేసింది. ఈ నేపథ్యంలో టీమిండియా దిగ్గజ కెప్టెన్, భారత్‌కు మూడు ఐసీసీ టైటిళ్లు అందించిన వీరుడు మహేంద్ర సింగ్ ధోని సైతం గౌతీ నవ్వు గురించి కామెంట్ చేశాడు. టీమిండియాకు శుభాకాంక్షలు చెబుతూ ఒకప్పటి సహచర ఆటగాడు గంభీర్‌ను ఉద్దేశించి ధోని పెట్టిన పోస్ట్ వైరల్ అయింది.

గంభీరమైన ముఖంలో ఆ నవ్వు..

''కోచ్ సాహెబ్.. మీ ముఖంపై చిరునవ్వు ఎంతో గొప్పగా ఉంటుంది. గంభీరమైన ముఖంలో ఆ నవ్వు.. అబ్బా అదొక కిల్లర్ కాంబో. మీరు అద్భుతం చేశారు'' అంటూ ధోని క్యాప్షన్ జతచేశాడు. ఇందుకు బదులిస్తూ.. ''నవ్వులు చిందించేందుకు ఇంతకంటే గొప్ప కారణం ఉంటుందా!.. నిన్ను చూడటం సంతోషంగా ఉంది'' అని గంభీర్ పేర్కొన్నాడు. కాగా ధోని ఈసారి టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు హాజరైన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌ను ఓడించి భారత్ మరోసారి పొట్టి క్రికెట్ వరల్డ్‌కప్‌ను ముద్దాడిన దృశ్యాలను ధోని ప్రత్యక్షంగా వీక్షించాడు. ఈ నేపథ్యంలో గంభీర్ ధోనిని కలుసుకోవడం సంతోషమంటూ కామెంట్ చేశాడు.

అతడు నా స్థానంలో ఉండాలి

ఇక తాజాగా రెవ్‌స్పోర్ట్‌స్‌తో మాట్లాడిన గంభీర్‌కు ధోని 'స్మైల్ కామెంట్' గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. ''ప్రపంచకప్ ఫైనల్ చూసేందుకు ధోని అక్కడికి రావడం సంతోషంగా అనిపించింది. తను నన్ను నవ్వమని అడగటం కూడా నచ్చింది. ఏదో ఒకరోజు అతడు నా స్థానంలో ఉండాలని కోరుకుంటున్నా. అప్పుడు నేను కూడా ధోని గురించి అదే కోట్ రాస్తాను. అతడు కూడా డగౌట్‌లో కూర్చుని నవ్వుతుంటే చూడాలని ఉంది'' అని గంభీర్ పేర్కొన్నాడు. తనలాగే ధోని టీమిండియా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టి.. కోచ్ హోదాలో ఐసీసీ ట్రోఫీ గెలవాలని ఆకాంక్షించాడు.

ధోని సారథ్యంలో గౌతీ


కాగా 2007లో ఐసీసీ తొలిసారి ప్రవేశపెట్టిన టీ20 ప్రపంచకప్ ట్రోఫీని ధోని సారథ్యంలోని టీమిండియా గెలిచింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకుంది. ఇక 2011లో ధోని కెప్టెన్సీలోనే సొంతగడ్డపై శ్రీలంకను ఓడించి వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీని భారత్ గెలుచుకుంది.

ఈ రెండు సందర్భాల్లోనూ గౌతం గంభీర్ భారత జట్టులో సభ్యుడు. ఇక ధోని 2013లో కెప్టెన్ హోదాలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కూడా గెలిచాడు. మరోవైపు.. 2024లో టీమిండియా హెడ్‌కోచ్‌గా వచ్చిన గౌతం గంభీర్ మార్గదర్శనంలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025, తాజాగా టీ20 ప్రపంచకప్2026 టైటిల్‌ను భారత్ గెలుచుకుంది.

ఇక తాజా విజయంతో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. ఓవరాల్‌గా మూడోసారి, వరుసగా రెండోసారి, సొంతగడ్డపై తొలిసారి టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ ప్రపంచ రికార్డు సాధించింది.

## విరాట్ ఆల్‌టైమ్ ఆర్సీబీ 'ఫైనల్ XI'..
# ఎవరికి అవకాశం ఇచ్చాడంటే?

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2026 సీజన్ బరిలోకి దిగనుంది. ఇప్పటికే విరాట్ కోహ్లీ సాధన మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. మరోసారి విజేతగా నిలిచి ఆర్సీబీకి కప్ ఏదో గాలివాటాన రాలేదని నిరూపించుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ తమ ఫ్రాంచైజీ ఆల్‌టైమ్ 'తుది జట్టు'ను ఎంచుకున్నాడు. ఇప్పటివరకు ఆర్సీబీ తరఫున ఆడిన ప్లేయర్లతో ఈ జాబితాను రూపొందించాడు. దీనికి సంబంధించిన ఓ వీడియోను ఆర్సీబీ తన సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.



''క్రిస్ గేల్‌తో కలిసి నేను ఓపెనింగ్ చేస్తా. ఇన్నింగ్స్‌ను విధ్వంసకరమైన రీతిలో ఆరంభించాలని కోరుకుంటా. ఏబీ డివిలియర్స్‌ను మూడో స్థానంలో ఆడిస్తా. ఫైనల్ XIలో నలుగురు విదేశీ క్రికెటర్లను ఆడించే వెసులుబాటు ఉంది. ఏబీడీ, క్రిస్ గేల్‌తోపాటు మిచెల్ స్టార్క్‌ను తీసుకుంటా. గతంలో అతడు మా జట్టులో ఆడిన ప్లేయరే. ఇక నాలుగో ఓవర్సీస్ ఆటగాడిగా డేల్ స్టెయిన్ వైపు వెళ్తా. అతడి బౌలింగ్ బాగుంటుంది. పదునైన పేస్ బౌలింగ్ ఉండాలి. అందుకే, ఈ ఇద్దరు సీమర్లకు అవకాశం ఇస్తా. మిడిలార్డర్‌లో ముఖ్యమైన నాలుగో స్థానం కేఎల్ రాహుల్‌దే. ఈ ప్లేస్‌లో ఆర్సీబీ తరఫున కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. రజత్ పాటీదార్‌ను ఐదో స్థానంలో ఆడిస్తా. స్పిన్‌ను మెరుగ్గా ఆడగలడు. ఆరో ప్లేస్‌లో దినేశ్ కార్తిక్ ఫినిషర్. స్పిన్నర్లుగా యుజ్వేంద్ర చాహల్, అనిల్ కుంబ్లేను తీసుకుంటా. మూడో పేసర్ కమ్ బ్యాటర్‌గా హర్షల్ పటేల్‌కు అవకాశం ఇస్తా'' అని కోహ్లీ విశ్లేషించాడు.

తుది జట్టు: విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, కేఎల్ రాహుల్, రజత్ పాటీదార్, దినేశ్ కార్తిక్, అనిల్ కుంబ్లే, హర్షల్ పటేల్, మిచెల్ స్టార్క్, డేల్ స్టెయిన్, యుజ్వేంద్ర చాహల్

## చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు..
## కర్ణాటక ప్రభుత్వ అనుమతి



మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ (IPL) మ్యాచ్‌లు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరుచేసింది. నిపుణుల కమిటీ భద్రత, సంసిద్ధత చర్యలపై ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న అనంతరం సోమవారం విధాన సౌధలో హోం మంత్రి జి.పరమేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (Royal Challengers Bengaluru) హోమ్ మ్యాచ్‌లకు ఈ వేదిక ఆతిథ్యం ఇవ్వనుంది. ఆర్సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో అయిదు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. అలాగే ఆర్సీబీ.. రెండో హోమ్ గ్రౌండ్ అయిన రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. ఐపీఎల్‌లో ఒక ప్లేఆఫ్ మ్యాచ్, ఫైనల్ కూడా బెంగళూరులో నిర్వహించే అవకాశమున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అనంతరం జస్టిస్ కున్హా నివేదిక సిఫార్సులను అనుసరించి, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (KSCA) ఐపీఎల్ 2026లో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రత చర్యలను ప్రవేశపెట్టిందని కార్యదర్శి సంతోష్ మీనన్ తెలిపారు.

గత దుర్ఘటన పునరావృతం కాకుండా చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా 35,000 మంది ప్రేక్షకులకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే చివరి నిమిషంలో రద్దీని నివారించడానికి మ్యాచ్‌కు 3, 4 గంటల ముందే స్టేడియం గేట్లను తెరవనున్నారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేయనున్నారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (BMRCL) భాగస్వామ్యంతో.. టికెట్ కలిగిఉన్న ప్రేక్షకులకు మెట్రోలో ఉచిత ప్రయాణ వసతి కల్పించనున్నారు.